నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 39



# నేటి కథలు జీవితమంత వైవిధ్యభరితం

**- కె. శివారెడ్డి**

ఆయనవన్నీ ఆసుపత్రి గీతాలే! అయినా ఆయన అజేయుడు. 'ఆమె ఎవరైతేమాత్రం' అంటూ భూమి మీది అందరి తల్లుల దుఃఖాలనూ తలకెత్తుకుని బాధపడి, పలవరించి, కలవరించి, కవిత్వం వెలువరించే కవి కె. శివారెడ్డి. ఆయన కవితా దృక్కులనుంచి తప్పిపోయే వస్తువు, సంఘటన ఏదీ ఉండదు. నిజాయితీగా పీడితుల పక్షాన కలమెత్తే అక్షరం ఏ ప్రక్రియలో వచ్చినా అక్కున చేర్చుకునే వీరు కథను అమితంగా ఇష్టపడతారు. ఆధునిక కవులలో కథను ఎక్కువగా ఇష్టపడే వ్యక్తి, చదివే వ్యక్తి ఈయనే! ఈయన కవిత్వాన్ని అభిమానించే వారు ఎందరున్నారో, అంత కంటే ఎక్కువమంది కథకులు సైతం వీరిని అభిమానిస్తుంటారు. కథలను విపరీతంగా చదివే ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డితో ఇంటర్వ్యూ ఈ వారం..

కె.శివారెడ్డిగారిని ఇంటర్వ్యూ చేయడం కోసం నేను, మా ఎడిటర్ ఎ.ఎన్. జగన్నాథశర్మగారితో కలిసి వెళ్లాను. శివారెడ్డిగారు వారి అబ్బాయి శంభుప్రసాద్ బంజారాహిల్స్ రోడ్ నెం.12లో నిర్వహిస్తున్న ఆర్ట్ ఎగ్జిబిషన్ వద్ద ఉన్నారు. మేం కూడా అక్కడే వారితోపాటు కూర్చున్నాం. చుట్టూ గోడలకు వేలాడుతున్న ఆధునిక చిత్రాలు విద్యుత్ దీపాల వెలుగులో వింతగా మెరుస్తున్నాయి. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. శివారెడ్డిగారు అక్కడ గోడలకు వేలాడుతున్న చిత్రాలనూ, గోడలను, ప్రస్తుత తన ఉనికిని దాటుకుని బాల్యంలోకి వెళ్ళిపోయారు. తన జీవితంలోని సుఖదుఃఖాలను అక్షరాలుగా వెదజల్లడం మొదలు పెట్టారు.

## అమ్మ చిన్నప్పుడే చనిపోయింది

మాది గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలోని కారుమూరివారి పాలెం. నేను 1943లో పుట్టాను. మానాన్న సుబ్బారెడ్డి, అమ్మ తులశమ్మ. అమ్మ చిన్నప్పుడే చచ్చిపోయింది. అమ్మ జ్ఞాపకార్థం మా పెద్దమ్మాయికి అమ్మపేరే పెట్టుకున్నాం. మాది కింది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. అప్పుల్లోను, ఆర్థిక ఇబ్బందుల్లోను వున్న కుటుంబం. అమ్మ చనిపోవడంతో నన్నూ, తమ్ముడిని నాన్నే అమ్మానాన్నయి పెంచాడు. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. మా వూళ్లో ఐదో తరగతి దాకా చదివాను. దగ్గర్లో ఉన్న కూచిపూడిలో ఎస్ఎస్ఎల్‌సి దాకా చదివాను. తెనాలిలో ఆంగ్ల-తెలుగు సాహిత్యంలో బి.ఎ., ఆంధ్రాయూనివర్శిటీలో ఎం.ఎ.ఇగ్లీషు చదివాను. 1967నుంచి 1999దాకా హైదరాబాదు వివేకవర్ధని కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడిగా పనిచేసి సాయంకాల కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యాను.

## బాల్యంలేని బాల్యం

నాది గోర్కీ మాటల్లో చెప్పాలంటే బాల్యం లేని బాల్యం. తల్లి లేకపోవటాన యింటి పనులు, వంటపనులు, వ్యవసాయప్పనులు చేయటం తప్పలేదు. ఆడుకుంటానికి టైమెక్కడుంది? ఆ వయసులో ఉండే ఆటపాటలుగాని, ఆనందాలుగాని లేవు. చాకిరే చాకి రీ. ఆ దశనుంచీ పరిస్థితులతో పోరాడి యింతదూరం రావడం ఆశ్చర్యమే! స్కూలుకు రానుపోను పది కిలోమీటర్లు నడిచేవాళ్ళం. స్కూలునుంచి ఐదుగంటలకు ఇంటికి వచ్చినాక సాయంత్రం మళ్ళా యింటి పనులే! ఆ లేబ్రాయంలో నిశ్శబ్దంగా రోదించిన రోజులెన్నో. ఓదార్చేవాడు గానీ, అనునయించేవాడు గానీ లేని బాల్యం. గాయకుడు కావలసినాణ్ణి, కవి కావటానికి బహుశా ఈ దుఃఖ భరితమయినటువంటి బాల్యపు నేపథ్యమే కారణం అయి ఉంటుంది. సుఖమో దుఃఖమో. బహుశా ఆర్థిక ఒడుదుడుకుల్లో వున్న కింద మధ్య తరగతి వ్యవసాయిక నేపథ్యం నుంచి రావటం వల్ల పరిస్థితులకు ఎదురు తిరిగి పోరాడే తత్వం ఉండటం వల్ల నెగ్గుకు రాగలిగాననుకుంటా. బహుశా ఆ పోరాట తత్వమే తల ఒగ్గనితనమే అంతర్లీనంగా నా కవిత్వమంతా పరుచుకుందనుకుంటా.

## నాన్న నన్ను చదువు మానేయమనేవాడు

మా నాన్నకి చదువన్నా, సంగీతమన్నా ప్రేమే! ఆయనది అద్భుతమయిన గొంతు. నాటకాలాడేవాడు. మా బాబాయి కూడా అంతే! హరిశ్చంద్ర నాటకం మొత్తం ఆయన నోటికొచ్చు. వర్షకాలం ముసురు పట్టినప్పుడు చావిట్లో మంచంమీద నన్ను కూర్చోబెట్టుకుని హరిశ్చంద్ర పద్యాలు నేర్పేవాడు. బహుశా వాళ్ళలో ఉన్నటువంటి కళకు సంబంధించిన తత్వమేదో నాకూ సంక్రమించిందనుకుంటా. మా నాన్న బతికినన్నాళ్ళు అప్పుల్లోనే బతికాడు. చదువంటే ప్రేమలేక కాదు, ఆర్థిక ఒత్తిడివల్ల అప్పుడప్పుడు నన్ను చదువు మానేయమనేవాడు.

## దొరికినంత చదువుతూనే ఉన్నా

మా అన్నయ్య (పెదనాయన కొడుకు) వెంకటరామిరెడ్డి నన్నాదుకున్నాడు. నేనింత దూరం రావటానికి ఆయనొక మోరల్ సపోర్ట్. ఆ రోజుల్లో అంటే అరవై ఏళ్ల కిందట మా ఊరికి రోడ్డుగాని, కరెంటుగాని లేని రోజుల్లో మా అన్నయ్య ఆంధ్రపత్రిక వీక్లీ, డైలీ తెప్పించేవాడు. ఆయన దగ్గర ఓ పెద్ద లైబ్రరీ ఉండేది. తెలిసీ తెలియని వయసులో అర్థమయినా కాకున్నా అప్పటిదాకా వచ్చిన తెలుగు నవలా సాహిత్యం మొత్తం అప్పటికే చదివాను. శరత్ సాహిత్యం మొత్తం అక్కడే చదివాను. చలం కథలు, కుటుంబరావు కథలు హైస్కూల్ దశలోనే చదువుకున్నాను. చెంఘిజ్‌ఖాన్ నవల, జగదేకసుందరి 'క్లియోపాత్ర' నవల, జైనేంద్ర కుమార్‌లాంటి గొప్ప నవలాకారులందర్నీ అప్పుడు చదివాను. బహుశా అందుకేనేమో నేనపుడపుడూ అంటూ ఉంటాను 'వచనంలోంచి కవిత్వంలోకి వచ్చిన వాడ్ని' అని. యిన్నేళ్ళ తర్వాత కూడా విస్తారంగా కవిత్వం చదువుతున్నా కూడా వచన సాహిత్యం చదవడం మానలేదు. యింకా పరిధి పెరిగింది. ప్రపంచ గొప్ప నవలాకారుల్నీ, కథకుల్నీ దొరికినంత చదువుతూనే ఉన్నా. రీడింగ్ హ్యాబిట్ నాకు స్కూల్ దశలో అలవాటు అవడం వల్ల అదింకా కొనసాగుతూనే ఉంది.

## అందరికీ మా ఇల్లు అడ్డా

ఆడవాళ్ళు లేని యిల్లు కాబట్టి మా ఇంట్లో అందరూ చేరేవాళ్లు. కూరగాయలమ్మేవాళ్ళు, బీడీలమ్మేవాళ్ళు, కూలి పనులకు వచ్చేవాళ్ళు, అందరూ అక్కడే! అదొక కమ్యూన్ లైఫ్‌లాగా వుండేది. బహుశా ఆ వారసత్వమే నేను హైదరాబాదు వచ్చినాక కొనసాగిస్తూ ఉన్నా. మనుషులంటే మహాప్రేమ వుండటం, మనుషులను చదవటం ఆనాటినుంచీ అలవాటయింది.



గాలి నాసరరెడ్డి, ఆశారాజు, సుగమ్‌బాబు, దేవిప్రియ, అజంతా, జగన్నాథశర్మ తదితరులతో

## కాలేజీ మ్యాగజైన్‌లో ఒక కథ రాశాను

కథాసాహిత్యం ఎక్కువగా చదువుకున్నప్పటికీ రాయడానికి గట్టి ప్రయత్నం చేయలేదనే చెప్పాలి. హైస్కూల్ దశలో రాసుకున్న కథలు నోట్‌బుక్‌లకే పరిమితమైపోయాయి. బి.ఎ.చదువుతున్న రోజుల్లో కాలేజీ మ్యాగజైన్‌లో ఒక కథ రాశాను. వచనానికీ, కవిత్వానికి విభజనరేఖ చాలా సున్నితమయింది. భావోద్రేకం సాంద్రత కవిత్వంలో ఎక్కువగా ఉంటుంది. విస్తృతంగా వచనం చదివేవాడు కవిత్వానికి ఆకర్షితుడవటానికి అతని స్వభావమే కొంతకారణం. హైస్కూలు, కాలేజీ రోజుల్లో పద్యాలూ పాటలు రాసేవాణ్ణి. పాడే అలవాటుంది. బహుశా చందస్సులో ఉండే ఆ గానగుణమేదో నన్ను ఆకట్టుకుని ఉంటుంది. అలా హైస్కూల్ దశలోనే కవిత్వంవైపు మళ్ళా.

## నచ్చినవి

**కవి** : నెరూడా
**నవల** : చెంఘీజ్ ఖాన్
**నవలారచయిత** : కేశవరెడ్డి
**కవయిత్రి** : జయప్రభ
**కథకుడు** : గోర్కీ
**సినిమా** : దొంగరాముడు
**పాట** : అన్నానా.. భామిని యేమని (సారంగధర)
**గాయని** : ట్రేసీ చాప్మన్ (బ్లాక్‌సింగర్)
**గాయకుడు** : ఘంటసాల
**నటి** : సావిత్రి
**నటుడు** : నాగేశ్వరరావు
**వంట** : చేపల కూర
**మిత్రుడు** : దేవీప్రియ
**వ్యక్తి** : మా నాన్నే!



కాళీపట్నం రామారావు తదితరులతో....

### కథకుడు అవధులు దాటటానికి వీల్లేదు

ఆఫ్రికన్ కవి 'శెంఘూర్'ని అడిగారట కవిత్వానికి, నాటకానికి తేడా ఏమిటని? దానికాయన సమాధానం చెప్తూ 'కవిత్వం పాడతాం, వచనం చదువుతాం' అన్నాడట. భావోద్రేకం తగ్గాక లేదా ఉధృతమయిన అలజడి సద్దుమణిగాక వర్ణనాత్మక విశ్లేషణాత్మకమై, ఘటనా పూరితమై కథ సాగుతుంది.

కవిత్వం సారాన్ని పట్టుకుంటుంది. ఒక ఘటనకి సంబంధించి కథలో ఉన్నంత డిటెయిల్స్ పాత్రలు గావచ్చు, ప్రాంతం గావచ్చు, కవిత్వంలో ఉండవు. సంయమనం అనేది కథకుడికీ, కవికి అవసరం అయినా కథకుడు అవధులు దాటటానికి వీల్లేదు. ఒళ్ళు మరిచే ఆవేశం ఉండటానికీ వీల్లేదు. కవిత్వం ఎలా చేసేంత ఉద్రేకంగానీ, ఉద్వేగం గాని, నిరసనకు సంబంధించిన ఆగ్రహం గాని కథ ఎలా చేయదు. చరిత్రలో ఒకానొక సందర్భం వద్ద జరిగిన మార్పునీ, ఘటనని కథకుడు పట్టుకునే పద్ధతికి, కవి పట్టుకునే పద్ధతికి తేడా వుంటుంది. ఈ ఇష్యూ ఏదయినా కావచ్చు. కవి వెనువెంటనే రియాక్టయి, ఘటన లేక సందర్భపు సారాన్ని కవిత్వీకరిస్తాడు. కథలో అది కుదరదు. పాత్రలు, సంభాషణలు, స్థల కాలాదులు అన్నీ కథకుడి దృష్టిలో ఉండాలి. వాటిని కళాత్మకంగా, కళావాస్తవంగా తీర్చి దిద్దేశక్తి కథకుడికుండాలి.

### యిప్పటి కథలు జీవితపు లోతుల్ని పట్టుకుంటున్నాయి

ప్రస్తుతం వచ్చే కథలు చాలా అద్భుతంగా ఉన్నాయి. వస్తున్నాయి. ఒకప్పుడు కవిత్వంలో ముందు వచ్చి, తర్వాత కథలోకి వచ్చేవి విషయాలు. యిప్పుడు కవిత్వమొచ్చినంత తొందరగానే ఆ మార్పుల్ని పట్టుకుంటూ విశ్లేషిస్తూ కథ వస్తోంది. మారుతున్న కాలంతోపాటు, జీవితంతో పాటు వస్తురూపాలు కథల్లోను అద్భుతంగా మారాయి. పూర్వమనేవాళ్లు కథకి ఒక యింట్రో మూలమని. యిప్పుడలాంటిదేమీ లేదు. కవితలాంటి కథలొస్తున్నాయి. బహుశా పిరియడ్ కథలు ఇప్పుడే వస్తున్నాయి. ఆధునిక జీవిత సంక్లిష్ట వైవిధ్యభరితమైన వస్తువు కవిత్వంలో ఓ రకంగా దర్శనమిస్తే, కథలో మరో రకంగా వ్యక్తీకరించబడుతుంది. జీవితానికి సంబంధించి అనేక సూక్ష్మాంశాల్ని, మానవ సంబంధపు దుఃఖభరితమైనటువంటి లోతుల్ని యిప్పటి కథలు పట్టుకుంటున్నాయి. జీవితమంత బహుముఖంగానూ, విశాలంగాను, వైవిధ్యభరితంగాను, యిప్పటి కథలు ఉండటానికి ప్రయత్నం చేస్తున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన కథల్ని నేను చదివాను. చదువుతున్నారు. అటు లాటిన్ అమెరికన్ కథలకు గాని, యిటు అమెరికన్ కథలకు గాని తీసిపోని గొప్ప కథలు తెలుగులో వస్తున్నాయి. నన్ను సంభ్రమాశ్చర్యానికీ, దుఃఖానికి, ఆవేదనకు గురిచేసిన కథలు తెలుగులో చాలా వచ్చాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని, విచ్ఛిత్తిని తెలుగు కథ అద్భుతంగా పట్టుకుంటోంది. ఈ విషయాలన్నీ ముందుగా ఆవేశసంబంధి అయిన కవిత్వంలో ప్రతిబింబించి, కొంచెం తేరుకున్నాక కథలో ప్రత్యక్షమవుతున్నాయి.

### బర్రె మీదెక్కి సవారీ చేశాం

నాకప్పుడు పదేళ్ళో, పదకొండేళ్ళో. మా తమ్ముడికి ఎనిమిదేళ్ళు. అది ఎండాకాలం. పొలంలో గొడ్లను మేపి మధ్యాహ్నానికి చెరువులో తోలేవాళ్ళం. ఒక రోజు చెరువులో దిగుతున్న మా బర్రెమీద నేనెక్కితే, నా ఎనకమాల మా తమ్ముడు ఎక్కాడు. చెరువులోకి వెళ్ళాక బర్రె మునిగింది. మేం మునిగాం. నేనూ, మా తమ్ముడు నీళ్ళు తాగేశాం. వాడు భయంతో నా మెడను వాటేసుకున్నాడు. యింకొక్క నిముషంలో చచ్చిపోయేవాళ్ళమే! ఏ శక్తి ప్రేరేపించిందో తెలీదు గానీ, వాడి చేతుల్ని బలవంతాన తీసేసి వాణ్ని ఒక్క తోపు తోసి, నేను ఒడ్డువైపుకొచ్చా. బహుశా యిది నేనెన్నటికీ మరువలేనిది. నాకనిపిస్తుంది 'మేమిద్దరం చెర్లో మునిగి చనిపోతే, మా నాన్న ఏమయ్యేవాడు' అని.

### దుంఖంలోనూ సంతోషభరిత అనుభవం

మా అమ్మ చనిపోయిన కొత్తలో, మా నాన్న నన్నూ, మా తమ్ముణ్ని చెరొకవైపు మంచంమీద పడుకోబెట్టుకుని, తెల్లార్లూ భజన కీర్తలను పాడుతూ ఉండేవాడు. అంతటి దుఃఖంలోనూ ఒక సంతోష భరితమైన అనుభవం అది!

### ఎందరున్నా తల్లిలేని పిల్లలు అనాథలే!

మా అమ్మ చనిపోవటమే అత్యంత బాధాకరమయిన అంశం. ఎందరున్నా తల్లిలేని పిల్లలు అనాథలే! అనాథలుగానే పెరిగాం. ఆ నేపథ్యమే పోరాడే తత్వం నాలో జన్మించటానికి కారణం అయిందనుకుంటా. దేన్నీ అంత సులభంగా వదిలే తత్వం కాదు నాది.

### అందరూ సాహిత్యాభిమానులే!

నాకిద్దరు భార్యలు. ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. పేరుకు రెండు కుటుంబాలే కానీ, కలిసి మెలిసి ఉండటంలో ఒక కుటుంబమే! అది ఆ ఇద్దరు మహా తల్లుల గొప్పతనమే! మా పెద్దాడు శ్రీకాంత్ కవి, కథకుడు. మా సంతానమంతా సాహిత్యాభిమానులే!

### ఇతర భాషల్లోకి అనువాదం కావాలి

ఇప్పటి కథలు ఇలా ఉండాలి అని నేనాశించటం కాదు, కాలం నిర్ణయిస్తుంది. ఆ కాలమే ఆనాటి కథకుల్నీ, కవుల్ని సృష్టించుకుంటుంది. యిప్పుడు తెలుగులో వస్తున్న గొప్ప కథలు భారతీయ భాషల్లోకి ముఖ్యంగా ఆంగ్లంలోకి అనువదించబడాలి.

- సుంకోజి దేవేంద్రాచారి

కవి కె. శివారెడ్డికి నచ్చిన కథ

# ఎందుకు పారేస్తాను నాన్నా?

- చాగంటి సోమయాజులు

**చెల్లిని వొళ్ళో కూచోపెట్టుకుని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెప్పుతున్నాడు. వాళ్ళనాన్న పిలిచి చుట్టలు తెమ్మని డబ్బులిచ్చేడు.**

**కృష్ణుడు వీధిముఖం చూడకుండా, మొగుడు చచ్చిన విధవలాగ ఇంట్లో దూరి కూచుంటున్నాడు. నాన్న చుట్టలు తెమ్మని పురమాయించేడు. హైస్కూలుదాటి చుట్టల దుకాణానికెళ్ళాలి. మేష్టర్లు, తోటి విద్యార్థులు అక్కడుంటారు. కృష్ణుడికి రోడ్డెక్కడమే నామోషీగా ఉంది. బడిపక్క నుంచి ఎలాగ వెళ్ళడమని గింజుకుంటూ బయలుదేరేడు.**

**ఉదయం ఎనిమిది గంటలు కావొస్తున్నది. బడి పెట్టేవేళ. వీధి చివరనుంచే బడిగోల సముద్రపు ఘోషలాగ వినబడుతున్నాది. బడిపక్క నుంచి వెళ్ళక తప్పదు; రాక తప్పదు.**

బడి కనబడగానే కృష్ణుడికి బెంగపట్టుకుంది. హైస్కూలు పిల్లల గందరగోళంతో కలకల్లాడుతున్నాది. వరండాలు, గదులు, చుట్టూ రోడ్లూ, విద్యార్థులతో, విద్యార్థినులతో చూడ సొంపుగా ఉంది. రోడ్డు వారగా కృష్ణుడు తలొంచుకుని పరిగెట్టాడు.

''కృష్ణా!'' అని స్కూలు వరండాలోంచి కేకొచ్చింది. కృష్ణుడు తిరిగి చూడక తప్పింది కాదు. నరిశింహం పరిగెట్టుకొచ్చి వాడి భుజం మీద చెయ్యేసి--

''ఏం రా, నువ్వు బళ్ళోకి రావడం లేదు?'' అనడిగేడు.

''సోమవారం చేరుతాను'' అని కృష్ణుడు చెప్పేడు.

''పుస్తకాలు కొన్నావా?''

''ఇంకా లేదు''

''వేగిరం కొనుక్కో, మళ్ళా అయిపోతాయి. ఎక్సరుసైజు పుస్తకాలు షాపుల్లో కొనకేం స్టోర్సులో చవగ్గా వున్నాయి. ధరలన్నీ దారుణంగా పెరిగి పోయాయిరా!''

నరిశింహం డబుల్‌కప్పు చొక్కా, హవాపెంటూ, జోళ్ళూ తొడుక్కుని నీటుగా ఉన్నాడు. కృష్ణుడుకి ఉన్న బట్టలన్నీ రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు; ఉన్నాయంటే ఉన్నాయి. ఒక నిక్కరుకి పోస్టాఫీసుంది. ఒక చొక్కా భుజం చిరిగి జారిపోతే, వాళ్ళమ్మ ఎత్తికుట్టింది. చెయ్యి బుట్టలాగ లేచిపోయింది. రేవుకో జత. కృష్ణుడు పేంట్లు కుట్టించమని ఎప్పుడూ ఏడవలేదు. పేంటుకైతే బట్ట ఎక్కువ పడుతుంది. బట్ట ఎక్కువైతే డబ్బు ఎక్కువవుతుందని వాడికితెలుసు. మరి రెండు జతలు కుట్టించమని బతిమాలుకున్నాడు. కాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఏడ్చుకొన్నాడు. ప్రయోజనం లేక పోయింది.

నరిశింహం చంకలో కృష్ణుడికి కొత్త పుస్తకం కనబడ్డాది.

''ఏం పుస్తకం రా అదీ?'' అనడిగేడు.

''ఇంగ్లీషు పుస్తకం. నేనన్ని పుస్తకాలూ కొనేశాను. జాగ్రఫీ పుస్తకమే కొనలేదు. జాగ్రఫీ పుస్తకాలింకా స్టోర్సు వాళ్ళకి రాలేదు. చూడు పుస్తకం'' అని ఇచ్చేడు.

కృష్ణుడు పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకంలోంచి ఒక విధమైన పరిమళం పైకి వచ్చింది. కృష్ణుడు పుస్తకం లోకి మొహం పెట్టి వాసన చూశాడు.

''కొత్త పుస్తకం వాసన బాగుంటుంది కదరా?'' అన్నాడు నరిశింహం.

''కమ్మగా ఉంటుంది. నాకెంతో ఇష్టం'' అన్నాడు కృష్ణుడు.

''నీ కింగ్లీషులో ఫస్టు మార్కురాలేదు, కదరా?''

''నాలుగు మార్కుల్లో పోయింది''

''ఎవరి కొచ్చిందిరా?''

''శకుంతల కొట్టేసింది''

''నిజమే? నేన్నమ్మలేదు; దాని కెన్నొచ్చాయి?''

''నా కరవై నాలుగు, దాని కరవై ఎనిమది''

''ఆడపిల్లని మేష్టరు వేసీసుంటాడు''.

''నీ మొహం! అది తెలివైంది''

''తస్సా చెక్కా! ఆడపిల్లలు చదివేస్తున్నారురా!''

కృష్ణుడు మార్కుల గొడవ తేగానే గొప్పవాడయిపోయాడు. తెలివైనవాడు కాబట్టే నలుగురూ గౌరవిస్తున్నారు. లేకపోతే వాడి కుళ్ళు గుడ్డలని చూసి అంతా దూరంగా ఉండేవాళ్ళే. వాడికి బడి పక్కని నిలబడడం, బడికెళుతున్న నరిశింహాన్ని చూడడం చాలా కష్టంగాఉంది. ఎంచేతంటే కృష్ణుడు బడికెళ్ళి చదువుకొనే అవకాశాలు తప్పిపోయాయి. వాళ్ళ నాన్న ఈ యేడాది కృష్ణుడికి చదువు చెప్పించనని నిశ్చయంగా చెప్పేశాడు.

''ఎక్కడేనా చదువు మాన్పించుతారండి? ఋణమో పణమో చేసి ముక్క చెప్పించక పోతే కుర్రాడెందుకేనా పనికొస్తాడా? చదువుకునే ఈడులో బడి మానిపించి, ఇంట్లో కూచోబెడితే తరవాత గాడిదలని కాయడానికేనా పనికి రాకుండా పోతాడు. ఏదో చూసి బడిలో వెయ్యండి?'' అని వాళ్ళమ్మ శతపోరి చెప్పుకొస్తున్నాది.

బళ్ళో వెయ్యగానే సంబరమా? వాడు చదివేది ఫోర్తుఫారమ్. జీతమెక్కువ. నెల నెలా ఎంత కట్టాలో తెలుసా? తూగ్గలనా? ప్రవేశపెట్టడానికి, పుస్తకాలకే ఔతుంది? ఏభై రూపాయలు. దస్తా కాగితాలు రూపాయి. అర్థణా పెనసలు ఆరణాలు! ఎక్కణ్ణుంచి తేవడం! మొహాన్ని వాడికి లేందే! వాడి ప్రారబ్ధం. మన ప్రారబ్ధం! వారం వారం ఎక్కడ లేని డబ్బూ బియ్యానికి ముడుపు చెల్లించడానికే తలప్రాణం తోక్కొస్తూన్నాది. మాటలా?'' అని వాళ్ళ నాన్న చెప్పుకొస్తున్నారు.

తల్లిమాటే నెగ్గుతుందో, తండ్రిమాటే నెగ్గుతుందో ఇంకా తేల లేదు. కృష్ణుడికి మాత్రం సందిగ్ధం లేదు. వాడు తల్లిదండ్రులని బాగా ఎరుగు. తల్లి ప్రతీ విషయంలోనూ బడబడ లాడడమేకాని ఆఖరికి తండ్రి చెప్పినట్టే జరుగుతూ ఉంటుంది. అంచేత చదువుకి స్వస్తి చెప్పడమే ఖాయమని నిర్ధారణ చేసుకొని నామర్దాతో కృష్ణుడు కుళ్ళిపోతున్నాడు.

కృష్ణుడికి కొత్త ఇంగ్లీషు పుస్తకం పేజీలు తిరిగేసినకొద్దీ గుండెల్లో గాభరా పుట్టింది. చదువుతున్న కుర్రాళ్ళమీద ఈర్ష్యా, తనకి చదువులేకుండా పోయిందన్న దుఃఖము – రెండూ రెండు లేడిక పాములై అతని బుర్రని కరకర లాడిస్తున్నాయి.

''కృష్ణా, వేగం చేరరా! డివిజన్లు పెట్టేశారు. నేను 'జే' డివిజనులో పడ్డాను. మన బేచి వాళ్ళంతా 'జే' డివిజనులోనే పడ్డారు'' అన్నాడు నరిశింహం.

''అమ్మ బాబో! 'జే' డివిజను దాకా పిల్లలున్నారా!'' అని ఆశ్చర్యపడ్డాడు

కృష్ణుడు.

''జే తో ఐపోలేదు. 'కే' డివిజను కూడా ఉన్నాది''

ఏ, బి, సి డి. అని లెక్కబెట్టి -- ''పదకొండు డివిజన్లే!'' అన్నాడు కృష్ణుడు. ఒక్క ఫోర్తుఫారములో సుమారు ఐదు వందల మంది విద్యార్థులున్నారు. కృష్ణుడు అక్కడ నిలబడలేక పుస్తకాన్నిచ్చేసి ''నేను చుట్టలకెళ్లాలి. పోతా'' నన్నాడు.

''ఈ బొమ్మ చూశావ్రా?'' అని నరశింహం పాఠాలకి ముందున్న త్రివర్ణ చిత్రం తీసి చూపించేడు.

రైతులు జొన్నచేలు కోస్తున్నారు. జొన్న రేకులని కూడదీసి కట్టుకొన్న పిట్ట గూడు గుడ్ల తోటే జారిపోతున్నాది. చేల మీద రెండు పిట్టలు ముక్కులు విప్పి ఎగురుతున్నాయి. కోతల వాళ్ళు తలలెత్తి పిట్టలని చూస్తున్నారు. అదీ త్రివర్ణ చిత్రం!

హైస్కూలు మొదటి బెల్లు ఖంగుఖంగుమంటూ దూరంగా ఉన్న పిల్లలందరినీ పిలుస్తున్నాది. రోడ్లు, వరండాలు, గదులూ విద్యార్థులతో, విద్యార్థినులతో, ఉపాధ్యాయులతో కలకల్లాడుతున్నాయి.

పుస్తకాలు పట్టుకుని సరస్వతీ దేవిలాగు శకుంతల వొచ్చింది. ఆమె చిన్న పిల్ల. పదకొండేళ్ళది. సూది ముక్కు, సూది గెడ్డాం, ఆ రెంటికీ పొందికయిన నోరు కలిగి ముద్దొస్తూ ఉంటుంది. తెలివితేటల తళుకుతో దాని కళ్ళు చాంచల్యాన్ని పొందుతున్నాయి.

''కృష్ణా! ఇంగ్లీషులో ఫస్టుమార్కు నాది!'' అని వొస్తూనే ఉడికించింది.

''ఒక్క ఇంగ్లీషులోనే కదా! నాకు మూడింట్లో ఫస్టు మార్కులొచ్చాయి. లెఖ్ఖల్లో నూటికి నూరు!'' అన్నాడు కృష్ణుడు.

''ఇంగ్లీషు ముఖ్యమైందండీ!'' అన్నాది శకుంతల.

''లెఖ్ఖలంతకన్నానండి. ఆ మాటకొస్తే తెనుగు ముఖ్యమండి. తెనుగులో ఫస్టుమార్కెవరిదండి?''

''ఇంగ్లీషే ముఖ్యమండి. ఎవరి నడుగుతావో అడుగు?''

''తెనుగేనండి. బియ్యే వాళ్ళక్కూడా ఇంగ్లీషులో మానేసి లెఖ్ఖలూ అవీ తెనుగులోనే చెప్పాలని పేపర్లో పడ్డాదండి''.

''నువ్వు మహా పేపరు చదివి ఏడిశావు?''

''నేనాంధ్రపత్రిక రోజూ చదువుతాను. మా యింటి దగ్గరవాళ్ళకొస్తుంది''.

రెండో బెల్లు ఖంగుఖంగుమని ప్రారంభమైంది.

నరశింహానికి శకుంతల మొహం చూడ్డానికి లజ్జవేసింది. వాడు చదువూ సంధ్యరాని దద్దమ్మ. వాళ్ళతో పాటు సంభాషించడానికి తాహతు లేక తల వాల్చుకుని మౌనవ్రతం పట్టేడు. తన హనావా పంట్లాము ధగధగలాడుతున్నా, కృష్ణుడి కుళ్ళు నిక్కరు కనబడుతున్నా వాడికి తక్కువతనం పట్టుకుంది.



రెండో బెల్లు కాగానే చల్లగా బడిలోకి జారిపోయాడు.

''బెల్లయింది, బళ్ళోకిరా?'' అన్నాది శంకుతల.

''నేను సోమవారం నుంచి వస్తాను'' అన్నాడు.

''ఫోర్తుఫారమ్‌లో నీ పని చెపతాను ఒక్క ఫస్టుమార్కు రానివ్వను''

''ఇహనన్ని ఫస్టు మార్కులు నీవేలే?''

''ఏం?''

''ఏమీ లేదు''.

''నువ్వు మా యింటికి రావడం మానేశావేంరా? మా అమ్మా, నాన్నా 'కృష్ణుడు రాలేదేమో' అని రోజూ అంటారు''.

''ఏమీ లేదు''.

''నేను బళ్లోకి పోవాలి బాబూ!'' అని పరిగెట్టింది.

''శకుంతలా?'' అని పిలిచాడు.

''ఏం!'' అని ఆగింది.

ఎందుకు పిలిచాడు? ఆమెతో నిజం చెప్పేసి దుఃఖోపశమనం చేసుకుందుకా? ఎందుకు పిలిచాడో వాడికే తెలియలేదు.

''ఏమీ లేదు'' అన్నాడు.

శకుంతల వెళ్ళిపోయింది. ఇద్దరూ ఒక్క ఈడువాళ్ళు. క్లాసుకి వాళ్ళిద్దరే అందరికన్నా తెలివైన వాళ్ళు. ఒకరి నోట్సు ఒకరు పుచ్చుకుంటూ స్నేహంగా వుండేవాళ్ళు. పంతంతో చదివే వాళ్ళు. శకుంతలతో పోటీ కృష్ణుడికి వికాసవంతంగా ఉండేది. శకుంతల దస్తూరీ కృష్ణుడికి జ్ఞాపకమొచ్చింది. ఆమె దస్తూరీ మంచిదికాదు. కొక్కిబిక్కిరిగా రాస్తుంది. అతనిది ముత్యాల కోవ

శకుంతల బడిలోకి పరిగెడుతుంటే కృష్ణుడు స్తంభించిపోయి చూస్తూ నిలబడిపోయాడు. పిల్లల గోలంతా క్రమేణా అణిగిపోయింది. వరండాలన్నీ ఖాళీ అయిపోయాయి. మేష్టర్ల మాటలు ఉండుండి వినబడుతున్నాయి. వేలకొద్దీ విద్యార్థులు డెస్కులు మీద వాలి కూచుని పాఠాలు వింటున్నారు. బడి దగ్గర నుంచి కృష్ణుడు కదలలేక పోయాడు. తన చదువు పోయింది కదా అని కుమిలిపోతున్నాడు. స్కూలు వరండాలో కెళ్ళాడు.

''నే నిక్కణ్ణుంచి కదలను'' అనుకొని స్తంభానికి జేరబడ్డాడు.

''నే నింటికి వెళ్ళను'' అని నిశ్చయించుకొన్నాడు.

నాలుగో క్లాసు దగ్గర నుంచి బడిలో తను చదివిన ఐదేళ్ళ సంగతులూ ఒక్కొక్కటే జ్ఞప్తికి వొచ్చేయి.

ఐదవ క్లాసు చదువుతుండగా ఒక పిల్లడు కృష్ణుడు మీద మేష్టరుతో చాడీలు చెప్పేడు. మేష్టరు నమ్మక అబద్ధాలు చెప్పేడని వాణ్ణే చితకతన్నేడు.

మూడవ ఫారంలో తెలుగు మాష్టరు ''గాంధారపతి'' అంటే అర్థం చెప్పమన్నాడు. అంతా నేల చూసి, ఇంటికప్పు చూసి, ధృతరాష్ట్రుడని చెప్పేరు. తనొక్కడే ''గాంధార దేశపు రాజు'' అని చెప్పేడు.

రెండవఫారం చదువుతుండగా దసరా తరువాత ఒక కుర్రవాడు బడికి రావడం మానేశాడు. వాడి పేరు రోజూ పిలిచి మేష్టరు ఆబ్సెంటు వేస్తూ ఉండేవాడు. ఆఖరికి వాడు చదువు మానేశాడని తెలిసింది. ఆ వేళ అటెండెన్సు రిజిష్టరులో వాడి పేరు కొట్టేసి మేష్టరు ''డిస్కంటిన్యూడ్'' అని రాసి ఆ ఇంగ్లీషు మాటకి అర్థం క్లాసులో చెప్పాడు. ఆ నాటి నుండి కృష్ణుడు ''డిస్కంటిన్యూ'' అన్న మాటకు అర్థం మరచిపోలేదు. ఆ పదం జ్ఞాపకం రాగానే అతనికి దుఃఖం పొర్లుకుంటూ వొచ్చింది.



''నేనింటికే వెళ్ళను'' అని పునః నిశ్చయించుకొన్నాడు.

''నేను భోజనానికే వెళ్ళను'' అనుకొన్నాడు.

అతని మొహం గాలి కొట్టిన కొత్త ఫుట్‌బాలు లాగ దుఃఖంతో పొంగి కందగడ్డ అయిపోయింది. ముక్కుసీటితో బరువెక్కి దిబ్బడేసి పోయింది. ముక్కు ఎగబీల్చుకొంటూ పొంగుకొస్తున్న దుఃఖానికి ఆనకట్టలు కట్టి దిగమింగుతూ స్తంభానికి జేరబడి పోయాడు.

మొదటి పీరియడ్ పోయింది. కృష్ణుడు కదలలేదు. వాళ్ళ నాన్న బజారుకి బయలుదేరేడు. వరండాలో కొడుకుని చూశాడు.

''ఓరి వెధవా! చుట్టలు తెమ్మంటే ఇక్కడ దిగమారేవేం?'' అన్నాడు.

''చూడు!'' అన్నాడు కృష్ణుడు.

''ఏమిట్రా చూడ్డం?'' అన్నాడు తండ్రి.

''పాపం. కనబడదు!''

''ఏమిటిరా నీ శ్రాద్ధం?''

''ఏమిటిరా?''

''వాళ్ళంతా బడికెళ్ళారు!''

అప్పుడు తండ్రికి కొడుకు మొహంలో విచారరేఖలన్నీ కనబడ్డాయి.

''వెర్రినాగమ్మా, అదిరా!'' అన్నాడు. కృష్ణుడికి ఆనకట్టలు తెగ్గొట్టుకుని దుఃఖం కొట్టుకొచ్చింది. వెక్కివెక్కి చుట్టుకుపోతూ ఏడుపు మొదలెట్టేడు. కొడుకు బాధంతా తండ్రికి బోధపడ్డాది. కొడుకు బాధంతా తండ్రి పడ్డాడు.

''చదువు మానిపించానని అంత బాధ పడుతున్నావా? బడి వరండాలు పట్టుకుని దేవుళ్ళాడుతున్నావా నాయనా? పద ఇంటికి?'' అన్నాడు.

''నేనాను!'' అని భూమి బద్దలై పోయినంత గట్టిగా అరిచేడు.

''ఏం చేస్తావురా?''

''గోడకేసి బుర్ర బద్దలుకొట్టుకొంటాను!'' అని ఇంకా గట్టిగా అరిచేడు. అంత పనీ చేస్తాడేమోనని వెళ్ళి తండ్రి కౌగిలించుకొన్నాడు.

''పద నాయనా ఇంటికి?'' అన్నాడు.

''బడి నాది!'' అని గట్టిగా కేకేశాడు.

''నీదేనురా బాబూ!''

''బడిలోకి తీసికెళ్ళు మరి''

''తల తాకట్టు పెట్టుకునేనా బళ్ళో వేస్తాను. ఇంటికి పద''.

''ఇప్పుడే వెయ్యి!''

''డబ్బు చూసి వేస్తాను''

''ఇంటికెళ్ళి లేదంటావు''

''అన్ను రా!''

''ఐతే పుస్తకాలు ముందు కొను?''

''వెర్రి నాయినా! వాటికి మాత్రం డబ్బొద్దూ!'

''ఒక్క పుస్తకం కొను''

''ఏ పుస్తకం కొనమన్నావు?''

''ఇంగ్లీషు పుస్తకం కొను!''

''కొందాం, పద ఏడవకు నాయినా, నే చచ్చిపోయాను ఏడవకు'' అన్నాడు తండ్రి. తండ్రి చెయ్యిని చంకలో పెట్టుకొని గిలగిల కొట్టుకొని ఏడుస్తూ బడిలో స్టోర్సుకి తోవతీశాడు.

తండ్రి దీర్ఘంగా ఆలోచించాడు. చుట్టలు మానేద్దామనుకొన్నాడు. ఎంత మానుదామనుకొన్నా మానలేక పోతున్నాడు. చుట్టలు మానేస్తే కృష్ణుడి జీతానికీ సరిపోతుంది! ఇంకో విధముగా పాలుపోలేదు.

''ఇందాకా చుట్టలకిచ్చిన డబ్బులున్నాయా పారేశావా?'' అనడిగేడు కొడుకుని.

''ప.... ప్ప.... ప్పారేలేదు, జేబులో ఉన్నాయి.... ఎందుకు పారేస్తాను నాన్నా?'' అన్నాడు కృష్ణుడు.

★

## ఈ కథ నా జీవితం



చాసో రాసిన 'ఎందుకు పారేస్తాను నాన్నా' నా బాల్యపు ప్రతిబింబం. దాంట్లో ఆర్థిక వత్తిళ్ళ వల్ల పిల్లాడ్ని తండ్రి చదువు మానేయమంటాడు. చదువుమీదున్న విపరీతమయిన మమకారం వల్ల రోజూ స్కూలుకెళ్ళి అక్కడ కూర్చుంటాడు ఆ పిల్లాడు. ఈ కథ నా జీవితం. అందుకే నాకత్యంత ప్రీతిపాత్రమయింది.

-కె.శివారెడ్డి

040-24110547